హైదరాబాద్ వార్త



## యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కొత్త యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్లో యుఎస్ కాన్సుల్ జనరల్‌గా పనిచేయడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అంతటా యుఎస్ ఇండియా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి తాను ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. భారత్, అమెరికా మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపర్చడానికి తాను ప్రాధాన్యమిస్తానని స్పష్టం చేశారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. హైదరాబాద్‌ను గొప్ప ప్రాంతంగా అభివర్ణించారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ స్థానంలో లారా విలియమ్స్ వచ్చారు. ఆమె గతంలో యుఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ స్టేట్‌లో ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్‌కు డిప్యూటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా పనిచేశారు.

వాషింగ్టన్లోని దౌత్యవేత్తలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రాయబార కార్యాలయాలను అనుసంధానించే సమాచార సాంకేతిక వేదికల సూట్ను నిర్వహించారు. తన కెరీర్ మొత్తంలో సున్నితమైన డేటాను భద్రపరచడం, ప్రజా దౌత్యాన్ని విస్తృతం చేయడానికి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వంటి విధులు చేపట్టారు. నికోసియా, అల్జీర్స్, రోమ్, మెక్సికో నగరాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలలో విధులు నిర్వర్తించారు.

వాషింగ్టన్, డి.సి.లోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో సైతం డిప్లొమాటిక్ టెక్నాలజీ బ్యూరో, సెక్రటరీ ఆపరేషన్స్ సెంటర్, రిక్రూట్‌మెంట్ ఆఫీస్, ఫారిన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్ స్కూల్ ఆఫ్ అప్లైడ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్‌స్పేస్, డిజిటల్ పాలసీ బ్యూరో, సెంటర్ ఫర్ అనలిటిక్స్ వంటి పదవులతో సహా విభిన్న పోర్ట్‌ఫోలియోలను నిర్వహించారు.

## మువ్వన్నెలు.. జిగేల్







పంద్రాగస్టు వేడుకలకు నగరం సిద్ధమైంది. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటనున్నాయి. గురువారం రాత్రి గోల్కొండ కోట, సచివాలయం, అసెంబ్లీ భవనం, చార్మినార్, కాచిగూడ రైల్వే స్టేషన్ తదితర భవనాలు విద్యుద్దీపాలంకరణలో తళుకులీనుతూ కనిపించాయి. మిలమిల మెరిసే కాంతుల్లో.. చూడముచ్చటైన రంగుల్లో సందర్శకులను కనువిందు చేశాయి. త్రివర్ణ పతాకం ప్రతిబింబించేలా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగు లైట్లతో ముస్తాబు చేశారు.

# ముంచిన మూసీ



నిండు కుండలా హుస్సేన్‌సాగర్

20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

10 గేట్లు ఎత్తి..12 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల

మూసీ నదికి పోటెత్తుతున్న వరద

భయం గుప్పెట్లో బండ్లగూడ జాగీర్ పరిసరాలు

లోతట్టు కాలనీ వాసులను సురక్షిత ప్రాంతానికి తరలింపు

మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలకు బ్రేక్

**శాంతించు గంగమ్మా** 3లో

ఈసీ నదికి మొక్కిన స్వామిగౌడ్

పురానాపుల్ వద్ద మూసీ ఉధృతికి మునిగిన దేవాలయం



చాదర్‌ఘాట్ వద్ద ఇళ్లల్లోకి చేరిన వరద నీరు



మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచేసిన వరద

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జంట జలాశయాలకు వరద ఉధృతి పెరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ వాసుల దాహార్తిని తీర్చే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల ఎగువ ప్రాంతాలైన వికారాబాద్, చేవెళ్ల, తాండూరు, శంకర్ పల్లి, అనంతగిరిహిల్స్ తదితర ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో హిమాయత్ సాగర్‌లోకి సుమారు 20 వేల క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరటంతో అధికారులు గురువారం ఉదయం పది గంటలకు నాలుగు గేట్లు, ఆ తర్వాతి గంటకు మరో రెండు ఆ తర్వాత మరో గేటును మూడు అడుగుల మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 10 గేట్లను ఎత్తి 12 వేల 50 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీ నదిలోకి విడుదల చేస్తున్నారు. జలాశయానికి చాలా సమీపంలోనున్న బండ్లగూడ జాగీర్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళలోకి నీరు రావటంతో అక్కడి స్థానికులను రెవెన్యూ, పోలీసు, జలమండలి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బండ్లగూడ జాగీర్, రాజేంద్రనగర్, అత్తాపూర్, పురానాపూల్, నయాపూల్, చాదర్ ఘాట్ ప్రాంతాల్లో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండగా, పోలీసులు వాహన రాకపోకలను నిలిపేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు ఎప్పటికపుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన చోట లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించటంలో నిమగ్నమయ్యారు. రాజేంద్రనగర్‌లో చేపలు పట్టేందుకు నదీలోకి వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో చిక్కుకోగా, అధికారులు రక్షించారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో హిమాయత్ సాగర్ రిజర్వాయర్ 9 గేట్లను నాలుగు ఫీటు మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేయగా, మధ్యాహ్నం తర్వాత ఇన్ ఫ్లో వెయ్యి మిగతా 3లో



పురానాపుల్ వద్ద పూజలు చేస్తున్న మహిళ



హుస్సేన్‌సాగర్ వరద ఉధృతి దృశ్యం

## సిల్ట్ తొలగింపునకు మెషినరీని పెంచండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం

వరద ప్రభావిత ప్రాంతాల్లో కాలువల పరిశీలన



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** వర్షాల వేళ నీట మునిగే అవకాశం ఉన్న ప్రాంతాలల్లో గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. అక్కడ వరద కాలువలను పరిశీలించి.. ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని అంబేద్కర్ బస్తీలో ఇటీవల కూలిపోయిన నాలా రిటైనింగ్ వాల్ పరిసరాలను పరిశీలించారు. ఈ గోడ పడిపోవడంతో వరద తమ ప్రాంతాలను ముంచెత్తుతోందని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ పర్యటించారు. ఇప్పటికే రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం అవ్వగా.. త్వరితగతిన పూర్తి చేయాలని అక్కడ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తర్వాత పాతబస్తీలోని తలాబ్‌చంచలం డివిజన్లో కమిషనర్ పర్యటించారు. అక్కడ గుర్రం చెరువు నుంచి మూసీని కలిపే వరద కాలువను మిగతా 3లో

## మరో మూడురోజులు అప్రమత్తం

ప్రమాదానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలపై నిరంతర నిఘా

వాటర్ లాగింగ్ పాయింట్‌లపై ప్రత్యేక దృష్టి

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** నగరంలో వచ్చే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలనీ, ప్రమాదానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలపై నిరంతరం నిఘా పెట్టాలని జోనల్, సర్కిల్,వార్డు అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. గురువారం ఉదయం రాజేంద్ర నగర్ సర్కిల్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , డిప్యూటీ కమిషనర్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. జల్‌పల్లి చెరువుతో పాటు వరదముప్పు ఉన్నప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజల భద్రతా కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగర ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు ట్రాఫిక్, విపత్తు బృందాలు కలసికట్టుగా పని చేయాలన్నారు. వరద నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగించాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్ లపై ప్రత్యేక దృష్టి పెట్టి ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ట్రాఫిక్ ఫ్లో సజావుగా జరిగేలా చూడాలన్నారు. మిగతా 3లో






## హైటెక్ అశ్లీలం



విదేశీ యువతులతో వ్యభిచారం

సోషల్ మీడియా, ఫోన్ల ద్వారా శృంగార ప్రియులకు గాలం

ఓయో, హోటళ్లు, స్పా సెంటర్లు అడ్డాగా దందా

పోలీసులకు పట్టుబడుతున్నా మారని తీరు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో పార్టీ కల్చర్, అశ్లీల కార్యకలాపాలు కూడా అంతే వేగంగా విస్తరిస్తున్నాయి. పోలీసులు ఎన్ని చర్యలు చేపడుతున్న వ్యభిచార ముఠాలను కట్టడి చేయలేకపోతున్నారు. స్పా సెంటర్లు, ఓయో రూమ్‌లు, హోటళ్లు, లాడ్జ్‌ల యజమానులతో కుమ్మక్కైన ముఠాలు వ్యభిచార దందాను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశీ యువతులను రప్పించి సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా శృంగార ప్రియులకు ఎర వేస్తున్నారు. ఇలా గలీజ్ దందా నడిపిస్తున్న ముఠాలు రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ అశ్లీల కార్యకలాపాలకు కొందరు మిగతా 2లో

## ప్రజారోగ్యానికి పొగ

నగరాన్ని చుట్టేస్తున్న పరిశ్రమల కాలుష్యం ఊపిరి తీస్తున్న కెమికల్ వాయువులు

ఫలించని శివారుకు తరలింపు ప్రయత్నాలు

పారిశ్రామిక వాడలకు వందలాది ఎకరాలు

కేటాయించినా కదలని పారిశ్రామికవేత్తలు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** నగరంలో పారిశ్రామిక వాడలు కాలుష్యపు వాడలుగా మారాయి. నగరవాసిని కాలుష్యభూతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతోంది. కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్యకారక పరిశ్రమలను శివారులోకి తరలించాలనే ప్రతిపాదన మరోసారి తెరమీదికి వచ్చింది. ఔటర్‌రింగ్ రోడ్డు వెలుపలకు ఈ పరిశ్రమలను తరలించాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల తరలింపు ప్రక్రియను వేగిరం చేయాలని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంత్రాంగాన్ని ఆదేశించారు. పరిశ్రమలను శివారులోకి తరలించాలని 2012లో అప్పటి కిరణకుమార్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా కేసీఆర్ సర్కారు కూడా ఈ అంశంపై కసరత్తు చేసింది. అయితే, ఈ వ్యవహారం ఆశించిన మేరకు ఫలితాలనివ్వలేదు. పారిశ్రామికవేత్తల లాబీయింగ్ పరిశ్రమల తరలింపు ప్రక్రియకు బ్రేక్ పడింది. కాలుష్య ఉద్గారాలను వెదజల్లుతున్న పరిశ్రమలు జనావాసాల్లో కొనసాగడం శ్రేయస్కరం కాదని, మిగతా 2లో



మణికొండలోని ఆనందహోమ్స్ లెగసీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెడ్‌మిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు



ఆచార్య గంగిశెట్టికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్, రమణాచారి తదితరులు

## గంగిశెట్టి సేవలు చిరస్మరణీయం

**నాంపల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త :** తెలుగు ప్రాచీనభాష సాధనలో కుప్పం విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ పాత్ర ఎనలేనిదని ఏపి శాసనసభ పూర్వ ఉపసభాపతి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం రెడ్‌హిల్స్‌లోని విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గంగిశెట్టి సంస్మరణసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య గంగిశెట్టికి కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వ పెద్దలు, సాహితీవేత్తలతోనూ తత్సంబంధాలుండేవని, తద్వారా నిధులు సంపాదించడంలో కృతకృత్యులయ్యారని తెలిపారు. రమణాచారితోపాటు ఆచార్య సి.మృణాళిని, డా. డి.విజయభాస్కర్, నరసరాజు, లలితాచండీ, సతీష్, ప్రకాశరావు తదితరులు లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు.

## మహనీయుల విగ్రహాలు పరిశుభ్రం

**కంటోన్మెంట్, ఆగస్టు 14 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు బానుక మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మహనీయుల విగ్రహాలను, పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్థానిక బిజెపి నేతలు ప్రతిక్ జైన్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అజయ్ గౌడ్. అభిలాష్, స్వరూప, బారతి, నరేంధర్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా 'బిసి' పోరు సాగాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త:** అట్టడుగు వర్గాలకు అధికారంలో సమాన భాగస్వామ్యమే దేశానికి అసలైన స్వాతంత్ర్యం అని బిసి రాజ్యాధికార సమితి అధినేత దాసు సురేశ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని బిసి రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంటులో రాజ్యాంగ సవరణ జరిగే వరకూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెనకడుగు వేయవద్దన్నారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కోరారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక సమావేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ తనిఖీ అధికారి (సిఈఐజిగా) నియమితులైన కె.నందకుమార్‌ను తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షులు జిసిరెడ్డి, ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యులు నక్కా యాదగిరిల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఆయనను శాలువాతో సత్కరించింది. ఈసందర్భంగా సిఈఐజి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ ప్రమాదాలు నివారణ అంశంపై ప్రతి జిల్లాలలో కాంట్రాక్టర్లు, వినియోగదారులు, ఇండస్ట్రీ విద్యుత్ సంబంధించిన వారిని అందరిని కలుపుకొని ప్రతి జిల్లాకు ఒక మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.మహేందర్. పెద్ద పుల్లారావు. మరియు చిన్న పుల్లారావు. జి సత్యనారాయణ, ఆర్.ప్రదీప్ రెడ్డి, శ్రీనివాసరావు, వి నరేష్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.



సిఈఐజికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు



ఫెన్సింగ్ తొలగించిన దృశ్యం

## సర్కారు స్థలానికి ఫెన్సింగ్ తొలగింపు

### 'వార్త' కథనానికి స్పందన

**నిజాంపేట్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామ సర్వేనెంబర్ 334లోని ప్రభుత్వ స్థలానికి రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ తొలగించారు. రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని పార్కు కోసం కార్పొరేషన్ అధికారిణి ఏకపక్షంగా ఓ గేటెడ్ కమ్యూనిటీకి అప్పగించిన వైనంపై 'వార్త'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బాచుపల్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్ భానుచందర్ గురువారం ఆ స్థలాన్ని పరిశీలించి అక్కడ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

## జెఎన్‌టీయూహెచ్‌లో సందడిగా తీజ్ ఉత్సవం

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 14, ప్రభాతవార్త :** కూకట్పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవం ఘనంగా జరిగింది. బంజారా విద్యార్థులు ఉత్సాహంగా సాంప్రదాయ నృత్యాలు అలరించాయి. బంజారా విద్యార్థి సంఘం యూనివర్సిటీ అధ్యక్షుడు దేవావత్ శ్రీకాంత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి నాయక్, ఉపాధ్యక్షులు గౌతమ్ నాయక్ తదితరులు ఆధ్వర్యం వహించగా..ముఖ్య అతిథులుగా బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక కళాకారులకు ఆహ్వానం

**రవీంద్రభారతి, ఆగస్టు 14 ప్రభాతవార్త :** పాత కాజాగూడలోని కూర్మ అవతార పద్మనాభస్వామిలో ప్రజాపతి కల్చరల్ ఈవెంట్స్ స్వామి వారికి దశావతార నృత్యనివేదన సమర్పించనున్నారు. ఇందుకుగాను ఔత్సాహిక నృత్యకళాకారులకు సదావకాశం కల్పిస్తున్నట్లు ఈవెంట్స్ ఛైర్మన్ ఫణీంద్ర కుమార్ తెలిపారు. ఈ నెల 20లోగా ఆసక్తి గల కళాకారులు తమ పేర్లను మొబైల్ 7901400222లో ఉచితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. వర్ధమాన కళాకారులను ప్రోత్సహించడమే ధ్యేయంగా వివిధరాష్ట్రాల్లో జాతీయస్థాయి కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, పేరిణి రీతుల్లో పలు నాట్యాంశాలతో నృత్యనివేదన సమర్పిస్తామని చెప్పారు. ఇందులో పాల్గొన్న కళాకారులకు మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందని ఫణీంద్ర వెల్లడించారు. అధికసంఖ్యలో ఆయా కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

## ఇద్దరు మొబైల్ స్నాచర్స్‌అరెస్ట్

**బేగంపేట ఆగస్టు 14,ప్రభాతవార్త :** మొబైల్‌లో మాట్లాడుతున్న వ్యక్తి నుంచి మొబైల్ దొంగిలించిన ఘటన రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రసూల్‌పురాకు చెందిన గోల్డ్‌స్మిత్ కనితి వాసుదేవరావు ఫోన్ మాట్లాడుతూ షాపునకు వెళ్తుండగా మోపెడ్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతని మొబైల్ లాక్కుని పారిపోయారు. బాధితుడు రాంగోపాల్‌పేట పోలీసులకు పిర్యాదు చేసాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులు శంకర్ పవర్ (19), కాలే శివ(21)లను అరెస్ట్ చేసారు.

# తెలంగాణ వాస్తవ చరిత్రను భావితరాలకు అందించాలి

మజ్లీస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ
రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి

**ముషీరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణ వాస్తవ చరిత్రను భావితరాలకు అందించాలని మజ్లీస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో అన్ వెప్ట్ అండ్ అన్ సంగ్ హీరోస్ ఆఫ్ తెలంగాణ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిధులుగా హాజరై వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ ప్రాంతం ముఖ్యమంగా హైదరాబాద్‌కు చెందిన యోధులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన తెలంగాణ చరిత్రను సమైక్య పాలనలో వక్రీకరించారని, ఈ నేపథ్యంలో తెలంగాన వాస్తవ చరిత్రను భావితరాలకు అందించేందుకు తెలంగాణ చరిత్రను సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో హైదరాబాద్‌లోని ఆంగ్లేయుల రెసిడెన్సీపై దాడి చేసిన హైదరాబాద్ యోధులు మౌల్వి అలావుద్దీన్, తుర్రే బాజ్‌ఖాన్, చిదాఖాన్ పేర్లు చరిత్రలో కానరావని గుర్తు చేశారు. కాలాపాని జైలులో మౌల్వి ఆలా ఉద్దీన్ 30 ఏళ్ల శిక్ష అనుభవించారని, ఆ జైలులో తొలి భారతీయుడిగా మౌల్వి శిక్ష అనుభవించారని, తుర్రే బాజ్‌ఖాన్‌ను ఆంగ్లేయులు కాల్చి చంపారని గుర్తు చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు పర్సనల్ సెక్రటరీగా పనిచేసిన హైదరాబాద్ గ్రామర్ స్కూల్ లో చదువుకున్న ఆబిద్ అలీ హసన్ సఫ్రాని దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించారని, జైహింద్ అనే నినాదాన్ని సృష్టించిన ఘనత సఫ్రానిదేనని పేర్కొన్నారు. ఇటువంటి అనేక మంది స్వాతంత్ర్య పోరాట యోధుల పేర్లు చరిత్రలో లేవని, తెలంగాణ చరిత్రను తిరిగి రాసే బాధ్యతలను కెప్టెన్ పాండు రంగారెడ్డికి ముఖ్యమంత్రి అప్పగించారని, వారి నాయకత్వంలో తెలంగాణ చరిత్ర తిరిగి రాయబడుతుందని అన్నారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ సెంటర్ ప్రధాన కార్యదర్శి టి.వివేక్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో జియా ఉద్దీన్ నయ్యర్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో ప్రసంగిస్తున్న ఓవైసీ




అంబర్‌పేటలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ నేతలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, సునితారావు తదితరులు

## ఓట్ల చోరీపై పోరాటం కొనసాగిస్తాం

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 14 ప్రభాతవార్త:** ఒక వ్యక్తికి ఒకే ఓటు అని రాజ్యాంగంలో ఉంది. ఈసీ దీనిని అమలు చేయడంలో విఫలమైందని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు.రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ పోరాటానికి సంఘీభావంగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలకలమ్మ,రాష్ట్ర అధ్యక్షులు సునీతరావు ఆదేశాల మేరకు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో భారీఎత్తున క్యాండిల్ ర్యాలీ జరిగింది. గురువారం అంబర్‌పేట పోలీస్ లైన్ నుండి శ్రీరమణ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వి.హనుమంతరావు,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ దేశంలో 65 లక్షల ఓట్ చోరీ జరిగిందని, అప్పుడు నోట్ చోరీ ఇప్పుడు ఓట్ చోరీ జరిగిందన్నారు.ఓట్ల చోరీపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు గారు మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఈ ఓట్ చోరీని ఇకపైన ఆపేయాలని, ఈ ఓట్ చోరీకి ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని అన్నారు. ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ పోరాటాన్నికి సంఘీభావం తెలుపుతూ ఈ రోజు దేశవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ ఈ క్యాండిల్ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఓటు హక్కును చోరీ చేసి గెలిచిన బిజెపి ప్రధానమంత్రిని గద్దదించేవరకు ప్రజలు ఇక ఊరుకోరని ఈ సందర్భంగా తెలియజేశారు. దొంగ ఓట్లతో గెలిచిన గెలుపు ఒక గెలుపు కాదన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శైలజ, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు అస్మా ,సుజాత, జిల్లా జనరల్ సెక్రెటరీ వనిత, బిందియా,కాంసెన్సీ ప్రెసిడెంట్ మాధవి, బ్లాక్ ప్రెసిడెంట్ షకీలా, డివిజన్ ప్రెసిడెంట్‌లు కవిత ,పద్మ, సౌమ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



మణికొండలోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటున్న విద్యార్థుల దృశ్యం

## కన్నుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు

**నార్సింగి, ఆగస్టు 14, ప్రభాతవార్త :** మణికొండలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టిమి వనడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. చిన్నారులు రాధా-కృష్ణుల వేషధారణలో వచ్చి దాండియా ఆటలు ఆడి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ వేడుకలలో మణికొండ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డిలు హాజరై చిన్నారులను ఉత్సాహ పరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులకు మెరుగైన విద్యను అందిస్తూనే ఆధ్యాత్మిక, సాంస్కృతి అంశాలలో అవగాహన కల్పిస్తూ, వారి వ్యక్తిత్వ వికాసానికి ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు పునాదులు వేస్తున్నారని తెలిపారు. చిన్నతనంలోనే సన్మార్గం, సత్సంగం, సదాచారం, దేశభక్తి, పెద్దల పట్ల గౌరవభావాలను పెంపొదిస్తే సమాజోద్ధారకులుగా పిల్లలు ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్దోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హైటెక్ అశ్లీలం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు, రాజకీయ నాయకులు పరోక్షంగా సపోర్ట్ చేయడంతో వ్యభిచార ముఠాలు అడ్డు అదుపు లేకుండా చెలరేగిపోతున్నారని సమాచారం. ఒకవేళ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లినా, మళ్లీ బెయిల్‌పై బయటకు రావొచ్చనే ధీమాతో నిందితులు ఈ వృత్తిని ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఇకనైనా స్పందించి, ఇలాంటి చర్యలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలో పుట్టగొడుగుల్లా వెలసిన హోటళ్లు, స్పా సెంటర్లు అక్రమంగా వ్యభిచార దందాను నిర్వహించడం, వాటిని పోలీసులు కూడా చూసి చూడనట్టు వదిలేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు.

**అక్రమంగా నగరంలోకి చొరబడి వ్యభిచారం..**

ఇతర రాష్ట్రాలు, విదేశీయులు అక్రమంగా నగరంలోకి చొరబడి వ్యభిచార దందాను నిర్వహిస్తుండటం కలకలం రేపుతోంది. ఈ మధ్య పోలీసులకు పట్టుబడిన మహిళల్లో అత్యధికులు వేరే రాష్ట్రాలకు చెందిన వారు ఉండటం గమనార్హం. ముఖ్యంగా బంగ్లాదేశ్, వెస్ట్ బెంగాల్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, జార్ఖండ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అమ్మాయిలు ఇక్కడి వారితో కుమ్మక్కై వ్యభిచారం నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలు, విదేశీ యువతులు పోలీసుల నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆధార్ కార్డు తదితర గుర్తింపు కార్డులను అడ్డదారుల్లో పొందుతున్నట్టు సమాచారం. ఒకవేళ పోలీసులకు పట్టుబడిన నకిలీ గుర్తింపు కార్డులతో పాస్‌పోర్టు పొంది తమ దేశానికి వెళ్లొచ్చని యువతులు పక్కా ప్రణాళికతో, కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యభిచార వృత్తిలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వ్యభిచార ముఠా గుట్టు రట్టు చేశారు పోలీసులు.

విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ కమిషనరేట్ ఏహెచ్‌టియూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) సిబ్బంది మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రినగర్ కాలనీలో గల బీఎస్‌ఆర్ సూపర్ లగ్జరీ అండ్ లివింగ్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించి వ్యభిచారం చేస్తున్న 9 మంది యువతులతో పాటు ముఠా నిర్వాహకుడు, విటులను అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సెఫ్టీ వింగ్ డీసీపీ కె.సృజన వెల్లడించారు.

ఈ నెల 12న హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు బంగ్లాదేశ్ యువతులతో పాటు వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఆరుగురు విటులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు.

## పెళ్లి పేరుతో లైంగిక దాడి

**బేగంపేట ఆగస్టు 14, ప్రభాతవార్త :** యువతిని వెంటపడి వేధించడమే కాకుండా లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లకుంట పోలీసుస్టేషన్ పరిధిలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బేగంపేట పోలీసుస్టేషన్‌కు బదిలీ చేసారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లకుంటకు చెందిన యువతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువే సమయంలో చింటూ(22) అనే యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డారు. ఆమె నిరాకరించింది. ఇంటర్ రెండో సంవత్సరంలో కూడా ఇదే విషయమై పదేపదే ఒత్తిడి చేశాడు. పెళ్లికి ఆమె అంగీకరించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రసూల్‌పురా అన్నానగర్‌లో ఉండే తన స్నేహితుడి గదికి ఆమెను తీసుకు వెళ్లి..లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొంతకాలం తర్వాత తాను గర్బవతి అయ్యానని, వివాహం చేసుకోవాలని ఆమె వేడుకుంది. పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశ్యం తనకు లేదని ప్రియుడు చెప్పడంతో బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజారోగ్యానికి పొగ

(మొదటి పేజీ తరువాయి)

మొదట్లో పారిశ్రామికవాడలు శివార్లలో ఉన్నప్పటికీ నగరీకరణ నేపథ్యంలో అక్కడ కూడా కాలనీలు వెలిసినందున వీటి తరలింపు అనివార్యమని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే రసాయనిక కంపెనీలను సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల్లో టీజీఐఐసీ ఆధ్వర్యంలో భూములను సేకరించి, పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేశారు. ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించారు. భూములను తీసుకున్న పరిశ్రమలు తమ కార్యకలాపాలను మాత్రం నగరం నుంచే కొనసాగిస్తున్నాయి.

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల వేల సంఖ్యలో చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు ఉన్నాయి. జీడిమెట్ల, కాటేదాన్, బొల్లారం, భోలక్‌పూర్, చర్లపల్లి, లింగంపల్లి తదితర పారిశ్రామిక వాడల్లో బీహెచ్‌ఈఎల్, ఐడీపీఎల్, హెచ్ఎంటీ, తోళ్ల పరిశ్రమ, ఐరన్, స్టీల్ వంటి భారీ పరిశ్రమలతోపాటు పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు ఏర్పాటయ్యాయి. వాటికి అనుసంధానంగా మరికొన్ని పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉద్యోగులు, కార్మికులు, ఉపాధి కోసం వివిధ వర్గాలకు చెందినవారు నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో కాలుష్య ప్రభావంతో జనాలు రోగాల బారిన పడుతున్నారు. వ్యర్థ జలాల నిర్వహణ అధ్వానంగా ఉంది. సాధారణ మురుగు కాలువల్లో ప్రమాదకరమైన రసాయన వ్యర్థ జలాలను విడిచిపెడుతుండటం స్థానికులకు సంకటంగా మారింది. స్థానికుల నుంచి ఫిర్యాదు వస్తేనే పీసీబీ అధికారులు చర్యలకు ఆదేశిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మూసివేయాలని చెప్పినా, అనధికారికం గా కార్యకలాపాలను నడిపి స్తున్నారు. రాష్ట్రంలో సుమారు 3,800 రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉండగా అందులో సుమారు 2 వేలకుపైగా పరిశ్రమలు నగరంలోనే ఉన్నట్లు అంచనా. ఆరెంజ్ కేటగిరీలోని 4 వేలకుపైగా పరిశ్రమల్లో సుమారు 2,500 వరకు నగర పరిధిలోనే ఉండొచ్చని అంచనా. వీటిల్లో ఇప్పటి వరకు సుమారుగా 40 శాతం కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. భోలక్‌పూర్‌ని తోలు పరిశ్రమను మేడ్చల్ జిల్లాకు, ఇనుము, స్టీల్ పరిశ్రమలను వికారాబాద్ జిల్లా రాకంచర్లకు, నూనె తయారీ పరిశ్రమలకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో టీజీఐఐసీ మౌలిక వసతులను అభివృ ద్ధి చేసి, పరిశ్రమల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. ఆసక్తి ఉన్న పరిశ్రమలకు ఆయా ప్రాంతాల్లో స్థలాలను కేటాయించారు. కొంత కాలం వేచి చూసి మీరు వెళ్లకపోతే ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించినా యాజమాన్యాల్లో పెద్దగా మార్పు కనిపించలేదు.

## కాలుష్యాన్ని భరించలేకపోతున్నాం

### - రెడ్‌మిక్స్ ప్లాంట్‌ను తొలగించాలి

### - కాలుష్యంతో సతమతం అవుతున్న స్థానికులు

**నార్సింగి, ఆగస్టు 14 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆనంద హోమ్స్ లెగసీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రెడ్‌మిక్స్ ప్లాంట్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ గురువారం సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సిటిజెన్స్ కౌన్సిల్ సభ్యులు బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ ఆరిఫ్ మహ్మద్‌లు మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘించి నడుపుతున్న రెడ్‌మిక్స్ ప్లాంట్ వలన పయనీర్‌కాలనీ, శ్రీకృష్ణరెడ్డి ఎన్‌క్లేవ్, ఈవివి కాలనీ, సైబర్ ఈ పార్క్, పుప్పాలగూడ ప్రాంతంలో ధూళి, దుమ్ము విపరీతంగా విడుదలై కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ఆనందహోమ్స్ లెగసీ వద్ద భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వలన రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, దీంతో వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారని తెలిపారు. పిసిబి అధికారులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్న రెడ్‌మిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. సిటిజెన్స్ కౌన్సిల్ సభ్యులు ఇచ్చిన వినతిపత్రంను చదివిన మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కమీషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీధర్, నవీన్, వంశీ, రామ్మోహన్, ఫైజ్, అతీఫ్ సైఫ్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి పేరుకున్న వ్యర్థాలను తొలగించాలి

**బేగంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రాంగోపాల్‌పేట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాలను వెంటనే తొలగించాలని రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మెక్లో డిగూడాలోని లోతట్టు ప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాలను కార్పొరేటర్ పరిశీలిం చారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన శిధిలాలు, చెత్తను తొలగించాలని హైడ్రా మాన్సూన్, శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంట చీరె సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, కోమల్ శర్మ, సాయి నగర్ వెంగల్ శర్మ లు ఉన్నారు.



మెక్లోడిగూడాలో వర్షానికి పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర

## భగత్‌సింగ్ ఆశయాలు సాధిద్దాం

**అఫ్జల్‌గంజ్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** గౌలిగూడ గురుద్వారా ఎదురుగా ఉన్న స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ విగ్రహానికి శుభ్రపర్చి పాలాబిషేకం చేశారు.స్వచ్ అభియాన్‌లో భాగంగా బేగంబజార్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్బంగా జిహెచ్ఎంసి బిజెపి ఫ్లోర్‌లీడర్ గొంటి శంకర్‌యాదవ్ మాట్లాడుతూ దేశ సేవ కొరకు,స్వాతంత్ర కోసం చేసిన పోరాటాలను, జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు బండ క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి సతీష్ వంజరి, మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి స్వప్న, బసంతికౌర్, శ్రీనివాస్, విజయ్ బిజెపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగాల్లో నైపుణ్యం సంపాదించండి

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 14, ప్రభాతవార్త :** విద్యార్థులకు సాంకేతిక విద్యపై పట్టు సంపాదిస్తే ఉన్నత ఉద్యోగ అవకాశాలు చేకూరతాయని కూకట్పల్లి జనసేన పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పేర్కొన్నారు. గురువారం కెపిహెచ్బి కాలనీలో ఓ టెక్నాలజీ కోచింగ్ సెంటర్‌ను లాంఛనంగా ఆయన ప్రారంభించారు. నేటి యువత కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో నైపుణ్యం సంపాదించి సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. కోచింగ్ సెంటర్‌లో వివిధ సాంకేతిక కోర్సులు, ప్రోగ్రామింగ్ భాషలు, కెరీర్ మార్గదర్శక శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఆడబల షణ్ముఖ, జనసేన నాయకులు వేముల మహేష్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు, వీరమహిళలు పాల్గొన్నారు.



ప్రేమ్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## సిసి రోడ్డు సమస్య పరిష్కరిస్తాం

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్‌లో సమస్యాత్మకంగా ఉన్న సిసి రోడ్డును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం పరిశీలించారు. నిధుల కోసం ప్రతిపాదనలు పెట్టామని, మంజూరు అవ్వగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జనార్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల

## 16న కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాలు

**సికింద్రాబాద్, ఆగస్టు 14 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి ఉత్సవాలను ఈనెల 16న నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షుడు జి.దివాకర్ ముదిరాజ్ తెలిపారు. గురువారం కమిటీ సభ్యులతో కలిసి జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సికింద్రాబాద్ లోని బోయిగూడలో ఉన్న ముదిరాజ్ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర క్రీడలు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరవుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఉత్తమ క్రీడాకారులకు, సామాజిక సేవ సేవకులకు సన్మానాలు ఉంటాయని, జంట నగరాలలో ఉన్న ముదిరాజ్ బంధువులు తప్పకుండా హాజరు కావాలని వారు కోరారు.



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

## చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

**బేగంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** చిరు వ్యాపారులకు ఎండ వానల నుంచి రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో గొడుగులు పంపిణీ చేసారు. టిపిసిసి ఉపాధ్యక్షురాలు కోట నీలిమ, సనత్‌నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## అడ్వకేట్స్ కో ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షులుగా సునీల్, జీవీఎస్ రామానాయుడు(ఉపాధ్యక్షులు) సిహెచ్ కృష్ణ(కార్యదర్శి ), కరికే మల్లేష్(సంయుక్త కార్యదర్శి), మక్కెన అప్పారావు(కోశాధికారిగా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అడ్వకేట్ సొసైటీ డైరెక్టర్లుగా నూతనంగా ఎన్నికయిన మక్కెన అప్పారావు (సిటీ సివిల్‌కోర్టు బ్రాంచ్), కరికే మల్లేష్ (నాంపల్లి క్రిమినల్ కోర్టు బ్రాంచ్), రావుల చెన్నారెడ్డి (సికింద్రాబాద్ కోర్టు బ్రాంచ్), జే.ఇంద్ర వర్ధన్‌గౌడ్ (రంగారెడ్డి జిల్లా కోర్టు బ్రాంచ్)లు ప్రమాణ స్వీకారం చేశారు. అడ్వకేట్ సొసైటీ ఫౌండర్ ట్రస్టీలు మర్రి దుష్యంత్‌రెడ్డి, బూరం శంకర్, జి.రాంరెడ్డి, ప్రమోద్‌కుమార్ కేడియా, మాజీ డైరెక్టర్లు కొండూరు వినోద్‌కుమార్, జలకం కిషోర్, లక్ష్మణ్ వర్ధ ఎన్నికయినట్లు సునీల్ తెలిపారు.

## 17న నెక్లెస్ రోడ్డులో 'గంగ పుత్ర' తెప్పోత్సవం

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణ గంగపుత్ర సంఘం, తెలంగాణ తెప్పోత్సవ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న ఆదివారం నగరంలోని నెక్లెస్ రోడ్డులో తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి శీలం రాజ్‌కుమార్ తెలిపారు. తెప్పోత్సవ శోభాయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్ర కుటుంబాలు తరలిరావాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రతిజ్ఞ

**చిక్కడపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త:** విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిషా ముక్తి భారత్ అభియాన్ సదస్సు నిర్వహించారు. ప్రధానాచార్యులు డా. కె.ప్రభు అధ్యక్షతన డాక్టర్ ప్రభు తదితరులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

## 26 ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని వినతిపత్రం

**చిక్కడపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం-2025ను సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును కలిసిను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

## ఎస్‌సి రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షునిగా రాజేశ్వర్

**మెహిదీపట్నం, ఆగస్టు 14, ప్రభాతవార్త :** లంగర్ హౌస్ షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ నూతన అధ్యక్షునిగా డి. రాజేశ్వర్, జనరల్ సెక్రటరీ గా బోగి బాలక్ దాస్‌లు నియమితులైన్నారు. ఈమేరకు ఎస్ సిఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దొమ్మటి సుదర్శన్ బాబు వారికీ రాష్ట్ర కార్యాలయం లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ పథకాలు దళితులకు అందక పోవడం తోనే అభివృద్ధి చెందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పతకాలు దళితులకు అందేలా తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో హరిదాస్ పుర అధ్యక్షులు బోగి మహేష్, జనరల్ సెక్రటరీ దొమ్మటి శ్రీకాంత్ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, రమేష్, పూర్ణ చందర్, పాండు లు పాల్గొనడం జరిగింది.

## మురికి నాలాల్లో మట్టి తీయాలి :హైడ్రా కమిషనర్

**యాకుత్‌పుర, ఆగస్టు 14 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పలు మురికి కాలువలను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాధ్,యాకుత్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్‌తో కలిసి సందర్శించారు.యాకుత్‌పుర నియోజకవర్గంలోని గంగానగర్,యస్రఫ్ నగర్ మురికి కాలువలను హైడ్రా కమిషనర్ రంగనాధ్ పరిశీలించారు. మురికి నాలాలలోని మురికి మట్టిని తీయాలని హైడ్రా కమిషనర్ రంగనాధ్‌ను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ కోరారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు,స్థానిక ఎంఐఎం కార్పొరేటర్లు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

## బేగంపేట విద్యార్ధినుల తిరంగా ర్యాలీ

**బేగంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకీ జై, వందేమాతరం, స్వతంత్ర్య భారత్, స్వచ్ఛభారత్ హర్ ఘర్ తిరంగా అంటూ నినాదాలతో కళాశాల నుంచి బేగంపేట రైల్వేస్టేషన్ బ్రిడ్జి వరకు ప్రదర్శనగా వెళ్లారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఛైర్ పర్సన్ ఆచార్య.కె.పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎన్ఎస్ఎస్ పీఓలు డా.కె.వెంకటేశ్వర్లు, డా.మధుకర్‌రావు, డా.సరిత, డా.ప్రసన్న ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



**కార్వాన్‌లో..**

**మెహిదీపట్నం, ఆగస్టు 14, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ కార్వాన్ డివిజన్ అధ్యక్షులు ఉద్దడి జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని కార్వాన్ లో నిర్వహించారు. కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ ఠాకూర్ అమర్ సింగ్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నిరంజన్ బాబు, శివ యాదవ్, కట్ట నర్సింగ్, కట్ల అశోక్, గంజి రగునాథ్,చంద్రకాంత్, గోపాల్, కృష్ణ, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ ఆధ్వ ర్యంలో... కార్వాన్ నియోజవర్గం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిది బుగిడి అనూప్ కుమార్, రాష్ట్రనాయకులు ఏ.సురేందర్ సింగ్ లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా జాతీయ జెండాలు చేత బూని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో జియాగూడా డివిజన్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, గుడిమల్కాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ నితీష్, కార్వాన్ డివిజన్ ప్రెసిడెంట్ విపిన్, గోల్కొండ డివిజన్ ప్రెసిడెంట్ చంద్రకాంత్, నానాల్ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ బాలాజీ మరియు నవీన్, శివ, సాగర్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బిజెపి శ్రేణులు

**దుండిగల్‌లో..**

**దుండిగల్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం దుండిగల్ పురపాలక బీజేపీ ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తాలో త్రివర్ణ పతాక ర్యాలీ నిర్వహించడం నిర్వహించారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వరాచారి, పురపాలక అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు డి. శ్యామ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పతకాలను అందజేస్తున్న బిజెపి నేతలు

## ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి

**అత్తాపూర్ ఆగస్టు14, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఇంటి మీద ఎగరవేసి దేశభక్తిని చాటాలని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. గురువారం బీజేపీ మైలార్దేవ్‌పల్లి 2 డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో కాటేదాన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జాతియ పతాకాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ కార్యక్రమాల ద్వారా దేశభక్తి, జాతీయ ఏకతా భావన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ర్యాలీలు నిర్వహించడం ద్వారా స్వాతంత్ర్య సంగ్రామంలో చేసిన త్యాగాలను ప్రజలకు గుర్తు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఒబిసి రాష్ట్ర నేత అదికే రాజు, ఒబిసి అసెంబ్లీ కన్వీనర్ బొమ్మ రాజు నర్సింహ గారు, బల్ల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నేత ఎం. ప్రభాకర్ గారు, మైలార్దేవ్‌పల్లి1 డివిజన్ అధ్యక్షులు పందు యాదవ్, గూడూరు అంజి, కొండాల, బీజెవైఎం నేత మహేష్, గుర్రం గణేష్, సాయి గుప్తా, రెహ్మత్, డి. వేణు కుమార్, పి. రవి, సురేష్ యాదవ్, జె. వినయ్, ఎస్. వినయ్, చరణ్, నిఖిల్ మరియు మరికొందరు పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్‌పై కొరడా

### ఓక్రిడ్జ్ స్కూల్ యాజమాన్యానికి నోటీసులు

**గచ్చిబౌలి, ఆగస్టు 14 ప్రభాతవార్త :** గచ్చిబౌలి ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ అక్రమ పార్కింగ్ మీద జీహెచ్ఎంసీ ఎట్టకేలకు చర్యలు చేపట్టింది. సువిశాలమైన క్యాంపస్ ఉన్నా ఓక్రిడ్జ్ సూ కల్ తన పార్కింగ్ కోసం జీహెచ్ఎంసీ రహదారిని వాడుకుంటుండడంతో ఖాజాగూడలో ప్రతి రోజు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. స్కూల్‌కు వచ్చే వాహనాలను మొత్తం రహదారుల మీద నిలిపి ఉంచడంతో పాటు స్కూల్ ముందు ఉన్న రహదారిని మొత్తం పూర్తిగా మూసివేస్తున్న ఓక్రిడ్జ్ స్కూల్ తన పార్కింగ్‌కు వాడుకుంటోంది. ఖాజాగూడ చెరువు మీదుగా ఉన్న కొత్తరోడ్డు నుంచి ఖాజాగూడ గ్రామానికి వెళ్లే రహదారిని మొత్తం మూసివేస్తున్న స్కూల్ యాజమాన్యం వాహనాల పార్కింగ్‌కు ఈ దారిని వాడుకుంటుంది. దీంతో పాటు స్కూల్‌కు వచ్చే వాహనాలు ఖాజాగూడ ప్రధాన రహదారి మీద నిలుపుతుండడంతో ఔటర్ రింగురోడ్డు చౌరస్తా నుంచి ఖాజాగూడ వైపు వచ్చే వాహనాలు ప్రతి రోజు ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ విషయమై ప్రజలు, వాహనదారుల నుంచి పిర్యాదులు అందడంతో జీహెచ్ఎంసీ స్పందించింది.

అక్రమ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఓక్రిడ్జ్ స్కూల్ యాజమాన్యానికి గురువారం జీహెచ్ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. జీహెచ్ఎంసీ చట్టం 1955, టిజిబిపాస్ చట్టం 2020ని ఓక్రిడ్జ్ స్కూల్ ఉల్లంఘించి ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమైందంటూ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి నోటీసు జారీ చేశారు. ప్రజా రవాణా రహదారుల మీద అక్రమ పార్కింగ్ నిషేదమని, దీనికి కారణమైన బాధ్యుల మీద జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నోటీసులో తెలిపారు. నోటీసు అందిన మూడు రోజుల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఓక్రిడ్జ్ స్కూల్ యజామాన్యానికి సూచించారు. నోటీసుపై స్పందించకపోతే పాఠశాల యాజమాన్యం మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా రహదారి మీద పార్కింగ్ చేసిన వాహానాలను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో పార్కింగ్ కోసం రహదారిని ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని ఓక్రిడ్జ్ స్కూల్ యాజమాన్యాన్ని ఆదేశించారు.

# ముంచిన మూసీ


పురానాపుల్ వద్ద వరద ఉధృతి దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం హిమాయత్ సాగర్‌కు 19000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా, 12046 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉంది. మరోవైపు ఉస్మాన్ సాగర్ (గండిపేట్) రిజర్వాయర్‌కు 2800 క్యూసెక్కుల వదర నీరు వస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. రిజర్వాయర్ మొత్తం సామర్థం 3.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.919 టీఎంసీలు. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుతం 1785.50 అడుగులకు నీటి మట్టం చేరినట్లు కూడా తెలిపారు.

హుస్సేన్‌సాగర్..పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తం

సిటీకి తాగునీటిని అందించే ప్రాజెక్టులతో పాటు అందానికి తలమానికంగా ఉన్న హుస్సేన్‌సాగర్‌లో భారీగా వరద చేరుతోంది. దీంతో నిండు కుండలా మారింది. హుస్సేన్‌సాగర్ నీటిని తూము గేట్ల నుంచి నీటిని వైశ్రాయ్, బల్దియా వైపు ఉన్న తూముల గుండా బయటకు వదులుతున్నారు. కూకట్‌పల్లి నాలా నుంచి అధిక ఇనోన్‌ఫ్లో వస్తుండగా, 1704 క్యూసెక్కులు హుస్సేన్ సాగర్‌లోకి చేరుతోందని జీహెచ్ఎంసీ లేక్స్ ఇన్ చార్జి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం తూముల ద్వారా 869 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అలాగే భారీ వర్షాలు కురిసినా హుస్సేన్ సాగర్కు ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి వస్తేనే నాలాకు సమీపంలోని అశోక్ నగర్, దోమలగూడ, గోల్నాక ప్రాంతాల వారిని ఖాళీ చేయించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

మూసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద తగ్గించడానికి మూసీలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, బురద మట్టిని పొక్లెన్‌తో హైడ్రా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గత రెండు రోజుల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. హిమాయత్ సాగర్‌కు వరద పెరగడంతో గేట్లు ఎత్తిన నేపథ్యంలో మూసారంబాగ్ బ్రిడ్జ్ పైకి వరద అంతకంతకూ పెరుగుతోంది. అంబర్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి మూసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలు గత కొంతకాలంగా పోలీసులు నిలిపివేశారు. మలక్‌పేట్ నుంచి బ్రిడ్జిపై మీదుగా అంబర్‌పేట్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతి ఉన్నప్పటికీ వరద ప్రవాహం పెరగడంతో వాహనాల దారి మళ్లించారు. దీంతో గోల్నాక కొత్త బ్రిడ్జిపై ట్రాఫిక్ మరింత పెరిగింది.

## సీల్డు తొలగింపునకు మిషనరీని పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. ఈ కాలువలో కొన్నేళ్లుగా పూడికను తీయకపోవడంతో పరిసర వందలాది కాలనీలకు వరదముప్పు వచ్చేదని.. ఇటీవల హైడ్రా పనులు చేపట్టడంతో ఈ ఏడాది ఇబ్బంది ఏర్పడలేదని స్థానికులు కమిషనర్‌కు వివరించారు. అక్కడ గత 15 రోజులుగా జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మెషినరీని పెంచి వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని హైడ్రా అధికారులను ఆదేశించారు.

## మరో మూడు రోజులు అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రమాదకర స్థలాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. వర్షకాలంలో ట్రాఫిక్, విపత్తు స్పందన బృందాలు సమన్వయం చేసుకుంటూ నగర జనజీవనానికి ఆటంకం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి, తక్షణ చర్యలు చేపట్టాలనీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశించారు.

## శాంతించు గంగమ్మా

### ఈసీ నదికి మొక్కి కొబ్బరికాయ కొట్టిన స్వామిగౌడ్

**నార్సింగి, ఆగస్టు 14 ప్రభాతవార్త :** హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిగా నిండడంతో జల మండలి అధికారులు ఒక్కసారిగా పది గేట్లు ఎత్తి 13,400 క్యూసెక్కుల నీటిని ఈసీ నదిలోకి వదిలారు. దీంతో ఈ జలాశయం దిగువనే ఉన్న కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద ఈసీ నది పరవళ్లు తొక్కుతూ ఉరకలు వేసింది. మాజీ శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద పారుతున్న ఈసీ నదికి మొక్కి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ ఇంత ఉధృతంగా పరవళ్లు తొక్కడం చాలా సంతోషంను కలిగిస్తుందన్నారు. వరద ఉధృతి చాలా ఎక్కువగ ఉందని, ఈ సమయంలో ఈసీ నదిలో చేపలు పట్టడం, ఈత పడడం చేయవద్దని సూచించారు. సెల్ఫీల మోజులో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, యువత సెల్ఫీలకు దూరంగా ఉండాలని స్వామిగౌడ్ తెలిపారు.


వరద నీటి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్




చాదర్‌ఘాట్ వద్ద..


మంచిరేవుల ఔటర్ సబ్‌రోడ్డులో పడ్డ భారీ బండరాయి దృశ్యం

## వర్షాలకు కూలిన పురాతన భవనం

**గోషామహల్, ఆగస్టు14 ప్రభాతవార్త:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జోరు వానలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలకు గోషామహల్ నియోజక వర్గంలోని అనేక ప్రాంతాలల్లో ఉన్న పురాతన భవనాలు ప్రమాదస్థితిలో ఉన్నాయి. బేగంబజార్ ప్రాంతంలోని సంతోషిమాతా ఆలయం సమీపంలో ఉన్న పురాతన భవనం ప్రహరీ గోడతో బిల్డింగ్ కుప్పకూలి పోయింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెన్ను ప్రమాదం తప్పింది. భవనం శిథిలా వ్యవస్థకు చేరుకుందని, వెంటనే కూల్చివేసుకోవాలని యాజమానికి జిహెచ్ఎంసి అధికారులు గతంలో నోటిసులు కూడా ఇచ్చినట్లు తెలిసింది. భారీ వర్షానికి తాకిడికి పురాతన భవనం కూలి పోయింది. బేగంబజార్ ఇలాంటి పురాతన బిల్డింగ్‌లోనే వ్యాపారులు షాపులు కొనసాగిస్తున్నారు. రద్దీ అధికంగా ఉండే ప్రాంతంలో పురాతన భవనాలను కూల్చి వేయాలని పబ్లిక్ డిమాండ్ చేస్తున్నారు.జిహెచ్ఎంసి అధికారులు కేవలం నోటిసులు ఇచ్చి సరిపెడుతున్నారు.నోటిసులు ఇచ్చిన వెంటనే కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని జిహెచ్ఎంసి అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు పురాతన భవన యాజమాన్యాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## డొల్లుకొచ్చిన బండరాయి..తప్పిన ముప్పు

### - ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడ్డ వాహనదారులు

**నార్సింగి, ఆగస్టు 14, ప్రభాతవార్త :** భారీ వర్షాలకు గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉన్న ఓ భారీ బండరాయి ఔటర్ సబ్ రోడ్డుపైకి వచ్చి పడింది. భారీ బండారాయి పడే సమయంలో అక్కడ వాహనదారులు లేకపోవడంతో పెద్ద ప్రాణనష్టం తప్పిపోయింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ సబ్‌రోడ్డుపై బండరాయి పడడంతో గురువారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి ఈ విషయం తెలుసుకొని తన సిబ్బందిని పంపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.




తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
కుత్బుల్లాపూర్ సర్కిల్-25

నిట్ నెం. & తేదీ : 14/DB/EE/కుత్బుల్లాపూర్ సర్కిల్/GHMC/2025-26, తేది: 13.08.2025
పని పేరు: గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయుట. అంచనా మొత్తం రూ.లక్షలలో: 13.30 లక్షలు. ప్రారంభ తేదీ & సమయం : 14.08.2025 మ.2.00గం. బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం : 20.08.2025 మ.2.00గం. టెండర్ ఆహ్వానించే అధికారి వివరాలు మొబైల్ నెం.తో : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నం. 9701365503, హెడ్ డ్రాఫ్ట్స్‌మన్, సెల్ నం: 7337557259. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ సర్కిల్-25, GHMC.
DIPR.NO. 6539-PP/CL/ADVT/1/2025-26, తేదీ: 14.08.2025

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ, డివిజన్-14, GHMC**

NIT No. 34. NIT No. 34/EE-14/GHMC/2025-26, తేది: 14.08.2025 పని యొక్క పేరు: GHMC, KZ, డివిజన్ 14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా మొత్తం/(రూ.లక్షలలో): 124.82, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.08.2025 ఉ.11.00 గం. మరియు బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 19.08.2025 ఉ.11.00 గం. (క్ర.సం.01 నుండి 05) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.08.2025 ఉ.11.00 గం. మరియు బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 21.08.2025 ఉ.11.00 గం. (క్ర.సం.06 నుండి 16) అధికారి పేరు & చిరునామా: EE-14, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్–14, GHMC
DIPR.No.6565-PP/CL/Advt/1/2025-26, తేది: 14.08.2025

# నిఘా నీడలో గణేష్ ఉత్సవాలు

### కోర్టు ఆదేశాలను తప్పకుండా పాటించాలి

### వివిధ శాఖల అధికారులతో సిపి సమన్వయ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలకు సంబంధించి కోర్టు ఆదేశాలను తప్పకుండా పాటించాలని హైదరాబాద్ సీపీ సివి.ఆనంద్ మండప నిర్వాహకులను సూచించారు. డీజే సిస్టమ్ వలన వృద్ధులకు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున గణేష్ ఉత్సవ సమితి వారు సహకరించాలని కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ గురువారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్‌శాఖ, ఆర్టీసీ, సైబరాబాద్, రాచకొండ పోలీసు అధికారులు, హైడ్రా, అగ్నిమాపక సేవలు (ఫైర్ సర్వీసు), పర్యాటక శాఖ (టూరిజం శాఖ), సమాచార శాఖ, రవాణా, వైద్య శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పలు సమస్యలపై మాట్లాడారు. ముఖ్యంగా రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చడం, రాత్రి వేళల్లో నిరంతరాయంగా విద్యుత్ దీపాలు ఉండేలా చూడటం, నిమజ్జనం రోజున భక్తులకు సరిపడా తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై స్పందించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ.. విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా బేబీ పాండ్స్, క్రేన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 160 స్పెషల్ యాక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, గణేష్ నవరాత్రుల సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనంగా అంబులెన్స్‌లు, అగ్నిమాపక బృందాలు, మొబైల్ టాయిలెట్లు, అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మెట్రో రైలు అధికారులు కూడా అర్ధరాత్రి వరకు అదనపు ట్రిప్పులు నడిపిస్తామని తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రాత్రి వేళల్లో కూడా సిబ్బందిని, అధికారులను నియమిస్తున్నామని జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డెవిస్ పేర్కొన్నారు. ఐసీసీసీ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ.. మూడు కమిషనరేట్ల పరిధిలోని సీసీటీవీ కెమెరాలను అనుసంధానం చేశామని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఇక్కడి నుంచే నిఘా కొనసాగుతుందని తెలిపారు. సి.వి. ఆనంద్ మాట్లాడుతూ.. విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి కోర్టు ఆదేశాలను తప్పకుండా పాటించాలని మండప నిర్వాహకులను కోరారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ ఉత్సవాలను జరుపుకోవాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ సంవత్సరం వినాయక చవితి నవరాత్రులు. మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకేసారి వస్తున్నందున అందరూ సమన్వయంతో పోలీసులతో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఐపీఎస్‌లు విక్రమ్ సింగ్ మాన్, పి. విశ్వ ప్రసాద్, హైడ్రా కమిషనర్ ఆర్.వి. రంగనాథ్, గజరావు భూపాల్, హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు, భాగ్య నగర్ ఉత్సవ సమితి ప్రెసిడెంట్ రాఘవ రెడ్డి, శశీధర్ రెడ్డి, సందీప్ రాజ్, ఖైరతాబాద్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిఎస్సి అగ్రికల్చర్ డ్యూయల్ డిగ్రీ కోర్స్‌లో ప్రవేశాలకు కౌన్సిలింగ్

**అత్తాపూర్ ఆగస్టు14,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు ఆస్ట్రేలియా కు చెందిన వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ లు సంయుక్తంగా అందిస్తున్న బి.ఎస్సి అగ్రికల్చర్ డ్యూయల్ డిగ్రీ కోర్స్ లో ప్రవేశాల కోసం ఈ నెల 18వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి ఈ సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. విశ్వవిద్యాలయం విడుదల చేసిన నోటిఫికేషన్ కు అనుగుణంగా ఇదివరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ కౌన్సిలింగ్ కు హాజరు కావాలని ఆయన సూచించారు. వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లు అందిస్తున్న ఈ కోర్సులో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్ రాజేంద్రనగర్ లోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం, ఆడిటోరియంలో 18 వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. అలాగే, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు శ్రీ పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయా ల పరిధిలోని వివిధ వ్యవసాయ, అనుబంధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు మొదటి దశ సంయుక్త కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలియజేశారు.

**IN THE COURT OF THE HON'BLE II ADDL.JUNIOR CIVIL JUDGE CUM V ADDL. METROPOLITAN MAGISTRATE, M.M.DIST. AT L.B.NAGAR**
**O.S. NO. 1006 OF 2025**

**BETWEEN:-**
Smt. Shaik Saidabee & another ...**Plaintiffs**
**AND**
Tahsildar, Ghatkesar
ALL CONCERNED ...**Defendants**

**NOTICE**

That the above named plaintiffs have filed the above suit for Declaration to declare them as legal heirs of deceased Late Shaik Madar Hussain S/o Shaik Mohammad, who died intestate on 24.02.2022, due to ill-heath by leaving behind the plaintiffs namely 1. Shaik Saidabee 2. Shaik Baba, as his legal heirs the above suit is pending before the Hon'ble V Addl. Junior Civil Judge, Medchal Malkajgiri District, at L.B.Nagar and the above suit is posted on 03-09-2025, for any objections. If any person/s is/are having any objections he/she may appear before the Hon'ble Court on 03-09-2025. At: 10:30 Am either in person or through an advocate, failing which the matter will be decided as per Law in your absence. **SCHEDULE OF PROPERTY:** All that Property of Plot No.15, Admeasuring Area 200 Sq.yds, or 167.225 Sq.mtrs, in Sy.No.36, Situated at Pocharam village, Ghatkesar Mandal, R.R. Dist., presently Medchal-Malakajigiri Dist and bounded by: NORTH : Neighbours Plot, SOUTH : 25 feet wide road, EAST : Plot. No.14, WEST : Plot. No. 30 feet wide road.

**// BY ORDER OF THE HON'BLE COURT //**

**M.RAMESH**
Advocate, H.No.5-5-12/P-2,
Opp: Sushma Theatre,
Vanasthalipuram, R.R Dist. T.S. **Cell. No: 9908019645**
Counsel for the Plaintiffs

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR AT RANGAREDDY DIST**
**DISPUTE NO. 61 OF 2025**

Between
**M/s. Saptavandana Chits & Finances Pvt. Ltd.,** Chandanagar Branch. ...**Disputant**
Vs.
**Sri. S.V. Deepak Kumar & OTHERS** ...**Opponents**

To
1. **Sri. S.V. Deepak Kumar,** S/o. Prabhakar, Aged about 40 Yrs., Occ: Asst. Managar, O/o. TS Tourism Department Corporation Ltd., O/o. Tourism Bhavan, 1st Floor, Himayath Nagar, Near Telugu Academy, Hyderabad-500 029. R/o. H.No.10-19/40/19, Ravindra Nagar, Near Mathman School, After Rampally X Road, Ghatkesar Road, Nagaram, Medchal-Malkajgiri-500 083
2. **Sri. B. Mahesh Kumar,** S/o. Keshavalu, Aged about 43 Yrs., Occ: Joint Manager, O/o. TS Tourism Department Corporation Ltd., O/o. Tourism Bhavan, 1st Floor,Himayath Nagar, Near Telugu Academy, Hyderabad-500 029. R/o. H.No.12-1-1301, Shanthinagar, North Lalaguda, Secunderabad-500017
3. **Sri. M. Kumara Swamy,** S/o. Yallaiah, Aged about 47 Yrs., Occ: Deputy Manager, O/o. TS Tourism Department Corporation Ltd., O/o. Tourism Bhavan, 1st Floor,Himayath Nagar, Near Telugu Academy, Hyderabad-500 029. R/o. H.No.17-871, I N Nagar, Goutham Nagar, Malkajgiri, Hyderabad-500 047.
4. **Sri. Mir Ahmed Ali,** S/o. Mir Mustafa Ali, Aged about 51 Yrs., Occ: Attender, O/o. TS Tourism Department Corporation Ltd., O/o. Tourism Bhavan, 1st Floor,Himayath Nagar, Near Telugu Academy, Hyderabad-500 029. R/o. H.No. 19-2-125/4/A/B/2/A, Tadban, Bahudurpura, Hyderabad.

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs. 71,469/-** And the same is posted to date : **09-09-2025** for your appearance before the office of deputy registrar of chits/arbitrator, Rangareddy dist at 12.00 am if you fail to attend the office of deputy registrar of chit, Arbitrator on the day the matter will be heard and decided exparty.

BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR

**B. Sandhya Naga Padma**
**Advocates**
#409, Swapnalok Complex,
S.D. Road, Secunderabad

**IN THE COURT OF THE HON'BLE III ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-III ADDL.JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI.**
**O.S.No. 591 of 2025**

BETWEEN:
1. **Tripuraribattla Murali** S/o T.B.R. Shastry (Late), aged 74 years, occ: Nil, R/o 2-178, Vaninagar, Near Vinaya Temple, Malkajgiri, Medchal-Malkajgiri District.
2. **Tripuraribattla Ravi Kumar** S/o Late T.B.R. Shastry, aged 65 years, occ: Pvt. service, R/o 2-178, Vaninagar, Near Vinaya Temple, Malkajgiri, Medchal-Malkajgiri District. ...**Plaintiffs.**

AND

1. **All concerned.**
2. **Tahsildar,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri District.
3. **Thripuraribatla Natraj** S/o Late T.Krishna Prasad, aged 56 years, occ: Pvt.service, R/o 6-32/3/50, Gayathrinagar, Dammaiguda, Keesara, Medchal-Malkajgiri District.
4. **Pannala Rajani** W/o Pannala Lakshmi Narayana, D/o Late T.Krishna Prasad, aged 54 years, occ:Household, R/o 6-3-596/42, SVR Colony, Anandnagar P.O. Khairatabad, Hyderabad 4.
5. **Kavuri Shyamala** D/o Late T.Krishna Prasad, W/o Kavuri Suryanarayana Murthy, aged 51 years, occ: Household, R/o 2-163, St.No.3, Vaninagar, Malkajgiri, Medchal-Malkajgiri District 47.
6. **Tripuraribhatla Nanda Kishore** S/o Late T.Krishna Prasad, aged 48 years, occ:Pvt.service, R/o Plot No.155, Flat No.101, SV Pearls, Tirumalanagar, Moulali, Kapra, Medchal-Malkajgiri District.
7. **Godavarthy Vishalaxmi** D/o Late T.B.R. Shastry, W/o G.Kameshwar Rao, aged 69 years, occ:Household, R/o 2-178, Vaninagar, Near Dayanand Nagar Railway station, Medchal-Malkajgiri District. ...**Defendants.**

TO
**All concerned.** ...**Defendant No.1.**
Please take notice that the above named plaintiffs filed the above suit to declare the status of the plaintiffs and defendants No.3 to 7 as legal heirs of late T.B.R.Sastry, who died on 28.8.1985. If any person having any objections, they may approach to the said court on 29.8.2025 at 10.30A.M. along with their objections, either in person or through their counsel. Failing which the status of the plaintiffs and defendants No.3 to 7 will be declare as legal heirs of the deceased T.B.R. Sastry.

**J. GOPALAKRISHNA, Advocate.**
Office at: H.No.1-1-111-1-35,
Plot No.35, Shivapuri Colony, Kapra,
AS Rao Nagar, Hyd-500062, T.S.
**Cell: 9849006125.**

## ఘనంగా బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు


బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. ఆగస్టు.14.ప్రభాతవార్త :**
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పద్మావతి కాలనీలోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ ఆలయ 11వ వార్షికోత్సవ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, రాజు, సుభాష్, కిరణ్, రామ్మోహన్, రామయ్య మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి మరియు తదితరులు ఉన్నారు.

## విస్తృతంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం


సలీంనగర్‌లో జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ సందడి సురేందర్ రెడ్డి, నిరంజన్ యాదవ్ తదితరులు

**మలక్ పేట, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
మలక్ పేటలో విస్తృతంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బిజెపి భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సలీంనగర్‌లో బిజెపి భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ తదితరులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ప్రధాని మోడీ సారధ్యంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, కొప్పుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
### -కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ


జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి పుష్పగుచ్ఛాను అందజేసి అభినందిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 14, ప్రభాతవార్త:**
రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నిర్వహించిన సమావేశంలో ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక మండప నిర్వాహకులకు, వినాయక నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. అనంతరం నూతనంగా నియమితులను జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అలీ, ఇ ఇ పీర్ సింగ్, గౌలిపుర కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు నిరంజన్ యాదవ్, మహేంద్ర, సంతోష్, రూప్ రాజ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనాథ్, ఉదయ్, పందరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బలాల


లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గంకు చెందిన పలువురు లబ్ధిదారులకు సుమారు 184 షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ షాది ముబారక్ , కళ్యాణ లక్ష్మి పథకాలు మహిళలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ మండల్ తాహసిల్దార్ నిహారిక, రెవిన్యూ అధికారులు యూనుస్ ,సంతోష్ రెడ్డి, మహమ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత రక్తదాన శిబిరం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**
దిల్‌సుక్‌నగర్ శాలివాహననగర్‌లోని శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండి డాక్టర్ సతీష్ తెలిపారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ, శాలివాహన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందనే ఉద్దేశంతో ఉచిత రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యువకులు రక్తదానం శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరానికి కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, బిజెపి అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

# ముసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

-బ్రిడ్జిపై బ్యారికేడ్ల ఏర్పాటు
-రాకపోకలను నిలిపివేసిన పోలీసులు
-చాదర్ ఘాట్ మూసానగర్‌లో జనవాసాలలోకి చేరిన వరద నీరు
-విస్తృతంగా సహాయక చర్యలు: ఎమ్మెల్యే బలాల


ముసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటీ దృశ్యం


ముసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసి బందోబస్తు ఏర్పాట్లు నిర్వహిస్తున్న ఎస్ఐ సంజీవరెడ్డి, చిత్రంలో ఎఐ శరత్ రెడ్డి తదితరులు


మూసా నగర్ లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 14, ప్రభాతవార్త:**
కొద్ది రోజుల నుంచి భారీ ఎత్తున కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మూసి నదిలో వరద నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం హిమాయత్ సాగర్ లో 8 గేట్లను ఎత్తివేయడంతో మూసి నదిలో వరద నీటి ప్రవాహం తీవ్ర స్థాయిలో కొనసాగుతూ ముసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. ముసారంబాగ్ బ్రిడ్జి వద్ద పరిస్థితిని గమనించి ముందస్తు భద్రత చర్యలలో భాగంగా కొద్ది రోజుల నుంచి బ్రిడ్జి వద్ద ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేసి పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మూసా నగర్ లోని పలు నివాసాలలో వరద నీరు హిమాయత్ సాగర్ ఎనిమిది గేట్లను ఎత్తివేయడంతో చాదర్ ఘాట్ మూసా నగర్ లోని పలు నివాసాలలో వరద నీరు చేరడంతో పాటు రోడ్లపై వరద నీరు ప్రవహించడంతోస్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో పలువురు బాధితులను అధికారులు సహాయక శిబిరాలకు తరలించారు. సమాచారం తెలియడంతో మలక్ పేట్ ఎమ్మెల్యే బలాల అధికారులతో కలిసి మూసా నగర్ లోని వరద ముంపు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఎవరు ఆందోళనకు గురి కావద్దని, అన్ని విధాలుగా సహాయ చర్యలు చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. పలువురు బాధితులను సహాయక శిబిరాలకు అధికారులు తరలిస్తున్నారని వివరించారు. అధికారులు ,సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం సహాయక శిబిరాలు ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ ను ఎమ్మెల్యే బలాల సందర్శించి ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు అబ్రార్ ,అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రమాదకర శిథిల భవనాలను గుర్తించండి
### ఇంఛార్జి కమిషనర్ వాణిరెడ్డి ఆదేశం



మీర్‌పేట్ కార్పొరేషన్ సిబ్బందికి దిశా నిర్దేశనం చేస్తున్న ఇంఛార్జి కమిషనర్ వాణిరెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**
భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాలను గుర్తించాలని ఇంఛార్జి కమీషనర్ వాణిరెడ్డి కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక సిబ్బందిని ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె పలువురు అధికారులు, వివిధ విభాగాలకు చెందిన క్షేత్ర స్థాయి సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె కురుస్తున్న భారీ వర్షాల వల్ల తలెత్తే ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక సిబ్బంది అన్ని డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పురాతన ఇళ్లను గుర్తించాలని సూచించారు. వాటిలో ప్రమాదకరంగా ఉన్న వాటిని కూల్చి వేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా వరద ముంపు సమస్యలు ఉన్న కాలనీల్లో అవి తీవ్రతరం కాకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. వరద నీరు సాఫీగా వెళ్ళేందుకు పనులు చేపడుతూనే పరవేక్షిస్తుండాలని ఆమె పేర్కొన్నారు. ప్రధానంగా చెత్తా చెదారం తరలించే పనుల్లో నిర్లక్ష్యం తగదనీ పారిశుధ్య సమస్యలు సక్రమంగా నిర్వహించి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని వాణిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ నాగేందర్‌రెడ్డి, డిఇఇ వేణుగోపాల్, ఆర్ఐ సౌమిక్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మదర్సాలపై చర్యలు తీసుకోవాలి
### - విద్యా కమిషనర్ మెంబర్‌కు వినతి


విద్యా కమిషన్ మెంబర్‌కు వినతి పత్రం ఇస్తున్న రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ మెంబర్ చారకొండ వెంకటేశ్‌ను కార్పొరేషన్ బిజెపి సెక్టార్ 1 అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం బడంగ్‌పేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యా కమీషన్ మెంబర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన రామకృష్ణారెడ్డి వినతి పత్రం సమర్పించారు. సుల్తాన్‌పూర్‌లో అక్రమంగా మదర్సాలు ఏర్పాటయ్యాయనీ ఈ మేరకు వాటిని బంద్ చేయించి అక్రమంగా నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన చారకొండ వెంకటేశ్‌ను కోరారు. ఇక పోతే బడంగ్‌పేట్ దావూద్ ఖాన్‌గూడలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పూర్తి చేయించి విద్యార్థులకు అందుబాటులో తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపికి చెందిన ఎ.సైదులు, ఎం.ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర


బీజేపీ తిరంగా ర్యాలీ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్ ఆగస్టు 14, ప్రభాతవార్త:**
బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర 79వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశభక్తి జ్వాలలతో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు . భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు గురువారం ట్యాంక్‌బండ్‌పై ప్రజలు అంతా ఒక్కటైన ఉత్సాహభరిత ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ , బండారు శ్రీ వాణి వెంకట్రావు, వేముల తిరుపతయ్య, కల్మకల లింగం, శీలం సుధా , తదితరులు పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ దేశభక్తి నినాదాలతో ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటా జాతీయ పతాకం ఎగరాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నాయకులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



ఉప్పల్ గణేష్ నగర్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ చిరంజీవి తదితరులు

**ఉప్పల్ ఆగస్టు 14, ప్రభాతవార్త:** ఉప్పల్ గణేష్ నగర్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలు గురువారం ఉప్పల్ పోలీసులు ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఉప్పల్ హైదారాబాద్ ఉత్సవ కమిటీ" వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉప్పల్ గణేష్ నగర్ లో ఆగస్టు 16 నుండి 21 వరకు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలు, 6 రోజులు చేసి చివరి రోజు 21 తేదీన ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికల ను ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి ఆవిష్కరణ చేశారు. సభ్యులందరూ కలసి ముఖ్య అతిథిగా విచ్చేయమని ఆహ్వానించారు. వేడుకలు ఘనంగా సంతోషంగా చేసుకోమని ఆయన సూచించారు. అనంతరం పోలీసు శాఖ సిబ్బందికి ఆహ్వాన పత్రికలను అందించారు. ఉప్పల్ గణేష్ నగర్, గాంధీ విగ్రహం వద్ద వేడుకలు జరుగుతున్నాయని తెలి పారు. ఈ కార్యక్రమం లో త్రైతసిద్ధాంతంప్రబోధ సేవాసమితి ఇం దూ జ్ఞాన వేదిక ఉప్పల్ హైదారాబాద్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీనివాస్, రవీంద్ర, శ్రీ లత, సరిత, సరూప , శ్రవణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



ఉప్పల్ లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం.

**ఉప్పల్ ఆగస్టు 14, ప్రభాతవార్త:**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా, లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల మరియు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ సంయుక్తంగా గురువారం"హర్ ఘర్ తిరంగా" ర్యాలీని నిర్వహించారు. కళాశాల నుండి ఉప్పల్ రింగ్ రోడ్ వరకు నిర్వహించారు. . ఈ ర్యాలీని కళాశాల డైరెక్టర్ రెవ్. బ్రదర్ జాన్ కల్లరక్కల్ ప్రారంభించారు. ఎన్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎం. ప్రసాంత్, నవీన్, సంతోష్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ త్రివర్ణ పతాకాల ను ఊపుతూ, "ప్రతి ఇంటా జెండా ఎగరాలి" అనే సందేశాన్ని ప్రజల కు చేరవేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## లార్డ్స్‌లో కనుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణ వేషధారణలో ఉన్న బాలలతో ఉట్టి కొట్టిస్తున్న లార్డ్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప

**సరూర్‌నగర్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలోనున్న లార్డ్స్ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల పుష్పాలు, రంగవల్లులతో అలంకరించిన పాఠశాల ప్రాంగణంలో వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన చిన్నారి బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. శ్రీకృష్ణలీలలకు సంబంధించిన ఘట్టాలపై ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, నాటికలు అలరించాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప ఉపాధ్యాయులతో కలిసి శ్రీకృష్ణ పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా ఆయన శ్రీకృష్ణ వేషధారణలో ఉన్న విద్యార్థులతో ఆడించి ఉట్లు కొట్టించారు. సందడిగా సాగిన ఈ వేడుకలో లార్డ్స్ వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ మరియన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనంపల్లి సహకారంతో అభివృద్ధి పథంలో కౌకూర్
### - కాంగ్రెస్ నాయకులు తుడిమెల్ల మల్లికార్జున్



**నేరెడ్ మెట్,కౌకూర్, ఆగస్టు 14.ప్రభాతవార్త**
కౌకూర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామాజిక సేవకుడు తుడిమెల్ల మల్లికార్జున్ తెలిపారు. ప్రజా సంక్షేమే తన పంతా అంటూ ముందుకు సాగే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు సహకారంతో మహాదేవ్‌పుర బస్తీ నుండి కౌకూర్ హనుమాన్ ఆలయ మెయిన్ రోడ్డును కలుపుతున్న ప్రధాన రహదారి, గల్లీ రోడ్ల అభివృధి పనులు మొదలయ్యాయి.బుధవారం వివిధ రహదారుల్లో వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా సరైన స్లోపులు ఉండేలా అధికారులు కొలతలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.అలాగే హనుమాన్ ఆలయం వెనుక జె.కె. ఆర్కేడ్ ప్రక్కన సూపర్ మార్కెట్ నుండి స్విమ్మింగ్ పూల్ వరకు ఉన్న ఖాళీ స్థలాన్ని బతుకమ్మ, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వంటి వేడుకలకు అనువైన జంక్షన్‌గా మార్చే పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో 133వ డివిజన్ జీహెచ్ఎంసీ డి.ఇ. రఘు, వర్క్ ఇన్స్పెక్టర్ హరి కృష్ణ, గ్రామ పెద్దలు కుసుగుండ్ల బాలకృష్ణ రెడ్డి, అల్లీ మల్లేశ్, సామల వెంకట్ రెడ్డి, సామల సుధర్శన్ రెడ్డి, అంజి రెడ్డి, నాగేశ్, కిరణ్, శివరాజ్, మనీష్, శివ, మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కార్పొరేటర్ జితేంద్రనాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుబజార్‌లో ఘనంగా బోనాల పండుగ


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ధీరజ్‌రెడ్డి, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 14 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ రైతుబజార్‌లో గురువారం బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రైతుబజార్ ఆవరణలో ఉన్న మైసమ్మ అమ్మవారికి రైతుబజారు వ్యాపారస్తులు బోనాల సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం అసెంబ్లీ బిజెపి కన్వీనర్ ధీరజ్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఉన్నా గణేష్ నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధు, నల్లెంకి ధనరాజ్‌గౌడ్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ నిర్వాహకులు పట్ల సత్యంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహేష్‌యాదవ్, జగన్‌ముదిరాజ్, అశోక్, నాయకులు ముంత రాములుయాదవ్, మంచి రాజేష్, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచలం దర్శనంలో ఉప్పల


అరుణాచలం దర్శనంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ దంపతులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**
తమిళనాడులోని అరుణాచలంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త కుటుంబ సభ్యులు మహదేవుడి శివగిరి ప్రదక్షిణ పూర్తి చేసుకొని,స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..అరుణాచలం గిరిప్రదక్షిణ ఒక పవిత్రమైన ప్రదక్షిణ అన్నారు. ఇది ఆధ్యాత్మికంగా చాలా ప్రాముఖ్యత కలిగిందని, భక్తులు దీనిని పాపాలు పోగొట్టుకోవడానికి, అంతర్గత శాంతిని పొందడానికి, దైవిక ఆశీ ర్వాదాలను పొందడానికి చేస్తారన్నారు. ఆస్వామివారి దయతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, సాయికిరణ్, శర్వారి, ఉప్పల సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా టీచర్ పై చర్యలు తీసుకోవాలి

**మన్సూరాబాద్ ,ఆగస్టు 14, ప్రభాతవార్త:**
ఎల్బీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో దారుణం చోటుచేసుకుంది. ఈ స్కూల్ లో రెండోవ తరగతి చదువుతున్న విద్యార్థి పై మహిళా టీచర్ వికృతంగా ప్రవర్తించింది. దీంతో కొన్ని రోజుల నుండి సదరు విద్యార్థి స్కూల్ కు వెళ్లకుండా ఎంతో ఆందోళనకు గురయ్యాడు. దీంతో అనుమానం వచ్చిన ఆ విద్యార్థి తండ్రి కృష్ణ చైతన్య రెడ్డి ఆ బాలుడి ని సైకియాట్రిస్ట్ కు చూపించగా బాలుడి మానసిక పరిస్థితి పై సదరు వైద్యుడు చైతన్యకు వివరించారు . దీంతో బాలుడి తండ్రి స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించి క్లాస్ రూమ్‌లో సీసీ కెమెరాలను పరిచిలించాలని అభ్యర్థించారు.అందుకు యాజమాన్యం నిరాకరించడంతో బాలుడి తండ్రి పోలీసులకు, కలెక్టర్ కు మరియు ఉన్నతాధికారులకు పిర్యాదు చేశాడు . దీంతో అధికారుల ఒత్తడి తో సీసీ ఫుటేజ్ పరిచిలించగ అందులో ఓ మహిళ టీచర్ సదరు విద్యార్థితో పాటు మరి కొంత మంది మూతి పై ప్లాస్టర్ వేసి వారి కళ్ళలో పెన్సిల్‌తో కుచ్చుతున్నట్లు కనిపించింది. ఈ ఘటన గత నెల రోజుల క్రితం జరగడంతో అప్పటి నుండి సదరు విద్యార్థి స్కూల్ అంటేనే భయపడుతూ ఉన్నాడు. ఈ ఘటన పై చైతన్య న్యాయ పోరాటానికి దిగడంతో గురువారం మాట్లాడామని స్కూల్ యాజమాన్యం పిలవడంతో చైతన్య మరియు అతని బంధువులు అక్కడికి చేరుకున్నారు. ఐతే స్కూల్ లో కి వెళ్ళకుండా అక్కడ సెక్యూరిటీ సిబ్బందితో తమని కొట్టించారని ఆగ్రహంతో స్కూల్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు. అంతే కాకుండా చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ కూడా పిర్యాదు చేచామని చైతన్య రెడ్డి తెలిపారు. స్కూల్ యాజమాన్యం మరియు సదరు మహిళా టీచర్ పైచర్యలు తీసుకోవాలని ఆయన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.